

# మెమెంటో

సధికా ప్రసాద్

ఆ రోజు నేను నిజంగా ఆశ్చర్యపోయాను,

మా ఆఫీసు మేనేజరు నన్ను పిలిచి "నీకు జాతీయ చిత్రకళా ప్రదర్శనలో ఫస్టు ప్రయిజు వచ్చినందుకు, నువ్వు గీసిన చిత్రాన్ని మాడ్రిడ్ ఆర్ట్స్ అకాడమీకి తీసుకెళుతున్నందుకు నీకు గ్రాండ్ పార్టీ ఎరేంజి చేస్తున్నాను. రేపు సాయంత్రం ఆఫీసు అయిపోగానే ఎవర్నీ ఇంటి కెళ్ళొద్దని నేను చెప్పానని చెప్పు" అన్నప్పుడు.

నే నీ వూరు ట్రాన్స్‌ఫరయ్యి ఐదు నెలలే అయింది. అందువల్ల కొద్దిగా పరిచయమున్న కొలీగ్స్ ఒక రిద్దరికి తప్ప ఎవరికీ నా ప్రయిజు విషయం చెప్పలేదు. అదీ విన్ననేగా చెప్పింది? మరి ఈయన కెట్లా తెలిసిందో? బహుశా పేపర్లో ఫోటో చూసుండొచ్చు. వివరాలుకూడా ఉన్నా యందులో.

అయినా—

ప్రకృతినీ, ప్రపంచాన్నీ తనివీ తీరా చూసుకునే సమయం లేక, జీవితమంటే నియమబద్ధమైన కళగా కాక, అవసర బద్ధమైన పాలసీగా మార్చుకున్న ఈ మనుషుల్లో—

అందులోనూ—

అనుబంధాలూ, ఆత్మీయతలూ అన్నీ క్రెడిట్‌లుగానో, డెబిట్లుగానో బేరీజు వేసుకుంటూ—

కనిపించిన ప్రతి వస్తువునూ పే ఇన్ స్లిప్‌గానో, విత్ డ్రాయల్ స్లిప్‌గానో భ్రమ పడుతూ—

కళల్నీ, కళారాధనలోని ఆనందాన్నీ జుర్రుకునే ఆవేశం లేక ప్రత్యక్షంగా డబ్బు చుట్టూ గిరవాటేస్తున్న ఈ బ్యాంక్ ఉద్యోగుల్లో ఇలాంటి కళాపిపాసి ఉండటం కళాకారుణ్ణయిన నన్నెంతగానో ఆనంద పరిచింది.

సముద్రపు టలల తాకిడికి ఆర్ద్రతలో పులకించి పోయిన కొండరాయిలా—వర్ష ఋతువులో వరదలై పారిన వర్షానికి పులకించి పోయిన పుడమి తల్లిలా నేను ఆనంద బాష్పాలు తుడుచుకున్నాను.

ప్రయిజులూ, అవార్డులూ స్వీకరించే టప్పటి కన్నా, ఒక కళాపిపాసికి అనుభూతి నిచ్చానని తెలుసుకున్నప్పుడు నిజమైన ఆనందాన్ని పొందుతాడు ఆర్టిస్టు.

ఆ అనుభూతితో నేను దిగంతాల్నే తట్టానో, ప్రపంచాన్నే జయించానో మీరు వూహించలేరు.

ఆ మరునాడు ఆఫీసుకి రాగానే—

'కొండరాయినే కరిగించ గలిగా' నన్న ప్రకాశరావు మాటల్లో గూఢార్థం నేను గ్రహించక పోలేదు.

మా మేనేజరంటే ఆఫీసులో వారెవరికీ పడదు.

ఆయన ముప్ఫయి అయిదేళ్ళ బ్రహ్మచారి. బంధువు లెవరూ ఉన్నట్టు లేరు. సరదాగా మాట్లాడడు. కంపెనీ అంటే ఇష్టం ఉండదు. ప్రతి క్షణం డ్యూటీ, డ్యూటీ అంటుంటాడు. ఉంటే ఆఫీసులో—లేదా తన గదిలో. బయట ఎక్కువగా తిరగడు.

తెల్లని లాల్చీ, పైజామా, పెరిగిన గడ్డం, దువ్వని తల—ఆఫీసు వాళ్ళు ఖాళీ దొరికితే చాలు నవ్వుకోవటానికి వేరే వెళ్ళక్కర్లేదు.

ఆయన పార్టీ ఇస్తున్నాడని తెలియగానే కొలీగ్స్ నన్ను వింతగా చూశారు. నిజం చెప్పద్దూ—నాకూ ఆశ్చర్యంగా ఉంది.

కాని ఆ రోజు సాయంత్రం నాకు పూలదండ వేసి ఆయన మాట్లాడిన మాటలు "కొండరాయి" లోనూ దాగని కన్నీ రుంటుందని నిరూపించాయి.

"మాటలతో బొమ్మల్ని సృష్టించే వాడు కవి. అలాగే బొమ్మలతో మాట్లాడించే వాడు చిత్రకారుడు. శరత్‌గారి బొమ్మలూ మాట్లాడతాయి వినగలిగే హృదయం ఉంటే. నేనే గనక చిత్రకారుణ్నయితే ఈ ప్రకృతినీ, ప్రపంచాన్నీ నా గదిలో దాచుకునే వాణ్ని." "నేనే గనక" అంటున్నప్పుడు ఆయన కళ్ళు చెమర్చాయి. "కాని నాకు సరళరేఖ గీయటమే సరిగా రాదు" అంటూ రాని నవ్వు పులుముకున్నాడు.

పార్టీ బాగా జరిగింది. అందరి కాంప్లిమెంట్సూ స్వీకరించాక ఇంటి దారి మళ్ళాను.

"మీరు ఒకటి, రెండు రోజుల్లో నా గదికి రావాలి. కళాకారులంటే నా కెంతో అభిమానం. తప్పక వస్తారు కదూ" అన్న ఆయన మాటలే ఒక రోజు ఆయన గది వైపు నడిపించాయి.

గేటు తీసుకుని లోపలికి నడుస్తున్నాను. ఒక స్త్రీ గానం లారస్థాయిలో వినిపిస్తోంది. ఎంకిపాట—"ఈ రోజు నా రాజు కేరాయిడెనో"—అనుమానం వేసి ఇంటి నంబరు సరి చూసుకుని మరీ నడిచాను. తలుపు తీసే ఉంది. టేప్‌రికార్డర్‌లో పాట వింటూ, టేబిల్ మీద చేతులు మడిచి, తల ఆన్చి వేలను చూస్తూ కూర్చున్నాడు మా మేనేజరు.

"సార్" అని మూడోసారి పిలిచాక కాని తల ఎత్త లేదు.

"ఓ! మీరా! రండి" అంటూ సీట్ ఆఫర్ చేశాడు.

ముఖంలో కనిపించిన ఆనందం ఎందుకో ఎర్రబడిన కళ్ళలో కనిపించ లేదు.

"మీరు ఇంత గొప్ప కళాకారుణ్నని నాకు చెప్ప లేదేం?" అన్నాడు.

"అలాంటి అభిప్రాయం నాకు కలగందే?" అన్నాను.

"ముందు బిస్కెట్స్ తీసుకోండి" అంటూ రెండు సాండ్విచ్ తీసి జ్యాన్‌లో చక్కెర కలుపు తూంటే ఆ రూమ్ అంతా కలియ జూడటం నా వంతయింది.

నాలుగు వైపులా గోడలు కనిపించకుండా షెల్ఫ్‌కలూ, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన చిత్రాలూ, ప్రకృతి దృశ్యాలూ నన్ను ఒక్కసారిగా దిగ్భ్రాంతుణ్నీ, ముగ్ధుణ్నీ చేశాయి.

అరవిందుడు, చిన్మయానంద, రాధాకృష్ణన్ దగ్గర నుండి కృష్ణమూర్తి, ఫ్రాయిడ్, సార్త్రే, జీబీయస్ వరకూ ఎప్పుడో ఉద్యోగం కోసం జనరల్ నాలెడ్జి చదివినప్పుడు తగిలిన వ్యక్తు లందరూ ఆ గదిలోనే ఉన్నట్టుగా ఉంది.

పికాసో కళాభిమానాన్ని చాటించే క్రూసి ఫిక్షన్, వీపింగ్ ఉమన్ ఎదురెదురుగా వేలాడ దీసి ఉన్నాయి.

"పికాసో మీద మీ అభిప్రాయం ఏమిటి?" పత్రికా విలేఖరిలా అడిగాను మాటలు తోచక.

"మరీ ఏమిటో సర్రియలిస్టిక్‌గా ఉంటా యండీ ఆయన చిత్రాలు. ఒక్కోసారి ముఖంలో ముక్కెక్కడుందో కూడా వెతుక్కోవాల్సి వస్తోంది."

"కాని పికాసో లేకపోయినట్లయితే ఈ సెంచరీ మొదట్లో మోడరన్ ఆర్ట్‌లో గొప్ప గ్యాప్ ఏర్పడే దంటారు. ఇప్పు డందరూ అవలంబిస్తున్న 'క్యూబిజం' ఆయన డెవలప్ చేసిందేగా" అన్నాను.

"ఏ ఇజమైనప్పటికీ జీవం ఉట్టిపడేట్లుగా, నిజరూపం లాగా భ్రమింప జేసేట్లుగా ఉండాలి." అభిప్రాయాన్ని సూటిగా చెప్పటం ఆయన కలవాటు.

"కాని ఈ మెకానికల్ వరల్డ్‌లో ఇంకా అంతగా భ్రమకు లోబడే వా ళ్ళున్నారంటారా?" నాలోని ఆర్టిస్ట్ తొంగి చూశాడు.

"భలేవారే! అది ఆర్టిస్ట్ చేతుల్లోనే ఉంది. జీ బీ యస్‌ని, సార్త్రేని చదువుతూంటే వాళ్ళు కళ్ళ ముందు కుర్చీలో కూర్చుని చెబుతున్నట్టుగా ఉంటుంది. రవివర్మ వర్క్స్ చూస్తుంటే కృష్ణుడు, రాముడు మన ముందు నిలుచున్నట్లుగా ఉంటుంది. అలాగే మీ చిత్రాలు చంద్రుణ్నీ ప్రకృతిని గదిలోకి తెస్తాయి. నిజంగా భ్రమించటం లేందే థ్రిల్ లేదు. కళాభిమానం లేదు. అది కళాపిపాసికి ఉండవలసిన ప్రథమ లక్షణం.

యూనో! ది వరల్డ్ ఈజ ఇట్సెల్ఫ్‌గా యాన్ ఇల్యూజన్. తను చెక్కిన శిల్పానికి ప్రాణం వచ్చినట్లు భ్రమించి సంభాషించే శిల్పి ఆనందం ఎవరు వర్ణించ గలరు!

భ్రమించటంలో అనంతమైన ఆనందం ఉంది."

ఎందుకో ఆయన మాట్లాడిన ప్రతి మాటా మా ఇద్దరి మధ్యా దూరాన్ని తగ్గించేది.

దీపం చుట్టూ వెలుగు తిరిగినట్లుగా—
చంద్రుని చుట్టూ వెన్నెల వెలిగినట్లుగా—
మే మిద్దరం స్నేహితులమయ్యాం.

విజ్ఞానాన్నీ ఒంటరితనాన్నీ పంచుకోవటానికి బ్రహ్మచారులం కావటం వల్ల ఆటంకాలేమీ కలగ లేదు.

ఇప్పుడు ఆఫీసు వాళ్ళకు నేను అదనపు జోకర్‌గా తయారయ్యాను— ముఖ్యంగా ప్రకాశరావు లాంటి వాళ్ళకు.

తన చుట్టూ చిన్న ప్రపంచాన్ని సృష్టించుకుని తనకు గిట్టని వాళ్ళు ప్రపంచానికే విరోధులు కావాలనుకోవటం మనిషిలోని మూర్ఖతకు నిదర్శనం.


ఐ కేర్‌డ్ లెస్ ఫర్ దెమ్,

ఒక రోజు కాలక్షేపంగా ఉంటుందని త్యాగరాజ గానసభకు వెళ్ళాం. బాలమురళి బాగా పాడాడు. పది గంటలయింది. ఇంటికి వచ్చే దారిలో టాంక్ బండ్ మీదుగా నడుస్తున్నాము.

ఎన్నో జంటలు రోడ్డు పక్కనే కూర్చుని హుస్సేన్‌సాగర్ లోకి చూస్తూ నవ్వుకొనే సమయం అది. వాళ్ళలో పెళ్ళి అయిన వాళ్ళూ, కావలసిన వాళ్ళూ, కావటానికి అవకాశం లేని వాళ్ళూ అందరూ ఉంటారు.

"గంటల తరబడీ వీళ్ళలో ఏం చూస్తారండీ వీళ్ళు" అన్నాను నవ్వుతూ.

"ఈ స్ట్రీట్ లైట్ల గుండె వెలుగును తనలో దాచుకున్న సాగరాన్ని..."




"ఎలుతురంతా మేసి యేరు నెమరేసింది" అంటాడు నండూరి. అన్నట్టు మీరు యెంకి పాటలు విన్నారా?" అన్నాడు.

"చదివాను కాని వినలేదు."

"నిజంగా వినలేదా? నా సీత పాడిన పాటలు వినలేదా?"

"మీ సీతా" అన్నాను ఆశ్చర్యంగా.

"ఓ! సారీ! మీకు సీత తెలియదు కదూ!" అన్నాడు గేటు తలుపు తీస్తూ.

"మీరు చెప్పందే?" అన్నాను ఆయన ముఖం లోని ఆవేదననూ కళ్ళలోని అచేతనతనూ గమనిస్తూనే.

లోపలికి రాగానే రికార్డర్ ఆన్ చేసి ఒక్కొక్క పాటే వినిపించాడు.

సన్నని వీణాస్వరంగా జంజారించిన ఆ కంఠ మాధుర్యం బీచ్ మీదికి వీచే చల్లని గాలిలా, సన్నని దారంగా వూగిసలాడుతూన్న ఆశల్ని చిగురింప చేసే అండగా నా గుండెని తాంకిది.

"మీ హృదయాన్ని కరిగించింది కదూ ఈ కంఠం? ఒకప్పుడు ఈ కంఠం వినటంలోనే నా హృదయం కరిగిపోయింది." చెలియలి కట్టను దాట

బోతున్న సముద్రం గుర్తొచ్చింది ఆయన కళ్ళను చూస్తుంటే.

నిజంగా ఆయన జీవితంలో గుండె బద్దలయ్యేట్లుగానో, మనసు ముక్కలయ్యేట్లు గానో ఏదో సంఘటన జరిగిందనీ, దాన్ని మరిచి పోవటానికి చేసే ప్రయత్నం లోనే అతను ఇంటలెక్చువల్‌గా పర్సనల్‌గా ఎదిగాడనీ నే నెప్పుడో వూహించాను. ఇంకా ఎన్నో పాటలు విన్నాను. సముద్రపు కెరటాలు కదిలి నట్లుగా ఆమె మీటిన వీణా నాదాన్ని విన్నాను.

"ఇవీ నా సీత వ్రాసిన లేఖలు" అంటూ చూపించాడు.

దస్తూరీ ఏమీ బాగాలేదు. కొన్ని చోట్ల రైలు పట్టాల్లా నిలువుగా, కొన్నిచోట్ల ఏటిపాయలా మెలికలుగా—ఉహూఁ! నా కేమీ అర్థం కాలేదు.

"ఇంత గొప్ప అందాలరాశి మీ ప్రేయసి కావటం మీ అదృష్టం" అన్నాను.

"అందాలరాశి అని మీ రెలా తెలుసుకున్నారు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఇంత ఘోరంగా రాసిందం టే గొప్ప అందాల-రాశే అయ్యుండాలి అందమైన అమ్మాయిలకి అక్షరాలు కుదరవుగా" అంటూ నవ్వాను. ఆయనా నవ్వాడు.

ఆయన ముఖంలో నవ్వు, విశాలమైన ఎడారిలో సన్నని నీటితుంపరలా ఉంది.

ఇన్నాళ్ళూ ఆయనలో కనిపించిన నిర్లిప్తతకీ కంటి పొరల వెనక దాగిని విషాదానికీ కారణం తెలిసింది.

ఆయన భగ్న ప్రేమికుడు.

"ఏ స్నేహం కోసం, ఏ ఆనందం కోసం ఈ సంఘాన్నీ మనుషుల్నీ దూరం చేసుకున్నానో—

ఏ రూపం కోసం ఏ సౌందర్యం కోసం నా ఆశల్నీ ఆశయాల్నీ మలుచుకున్నానో—

ఏ ప్రేమ కోసమైతే నా జీవితాన్ని అర్పిద్దామనుకున్నానో—అన్నింటికీ దూరమయ్యాను"

"ఇంతకీ మీ ప్రేయసి ఎక్కడ ఉంది" అని అడిగాను.

"ఎక్కడైతేనేం—ఆమెను చూడగలననీ, ఆనందం పంచుకోగలననీ ఆశ కనుచూపు మేరలో లేకపోయినా, 'ఒక్కసారి నీ చెవిలో వీడుకోలుప లికి' అన్నట్టుగా రాలిపోవాలని ఇంకా జీవిస్తూనే ఉన్నాను నా అదృష్టం కొద్దీ నువ్వు గొప్ప ఆర్టిస్టువి దొరికావు.

చక్కని కంఠం, మధురమైన వీణానాదం, విలక్షణమైన ప్రేమలేఖలు—నా సీతవి ఇన్ని ఆధారాలు ఉన్నయ్.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచబోతున్న ఆర్టిస్టువి—చేతిరాతలోనే అందాన్ని కొలిచిన నువ్వు నా సీత రూపాన్ని గీయలేవా?"

ఆయనెందుకో పిచ్చిగా మాట్లాడుతున్న ట్లనిపించింది నాకు.

కళాకారుడిగా నాకు ఒక వూహను సృజించటమే కాని, ఒక నిజాన్ని వూహించటం చేతకాదు. అలా తను దృష్టి కందని ఒక నిజ రూపాన్ని వూహతో కల్పించాలని ఎంతోమంది తపిస్తారు ఆ స్ట్రగులింగే కళ.

కాని ఆ క్షణంలో నే నంత అర్హుణ్ణి కాదేమో ననిపించింది. ఆయన్ని కన్విన్స్ చెయ్య ప్రయత్నించాను.

"ఆర్ట్ ఈజ నథింగ్ బట్ ఎ కాపీ ఆఫ్ ఏన్ ఐడియా ఆర్ కాపీ ఆఫ్ యాన్ ఆబ్జెక్ట్. సో, ఇటీజ సంథింగ్ లెస్ దేన్ ది ఆబ్జెక్ట్ ఆర్ ది ఐడియా. ఇది అరిస్టాటిల్ నిర్వచనం. నేను ఎంత ప్రయత్నించినా మిమ్మల్ని తృప్తి పరచలేను" అన్నాను.

"అందుకోలేని అందం కన్నా అందుబాటులో ఉన్న ఆనందం గొప్పది కాదా. నువ్వు ప్రయత్నించు. నీ మీద నా కా నమ్మకం ఉంది—ప్లీజ్, కాదనకు."

కళాకారుడిగా నా కున్న ఆవేశమో, కళాపిపాసిగా ఆయనకు నా మీద ఉన్న నమ్మకమో కుంచెను నా చేతి కందించాయి.

ప్రపంచ పోటీల్లో పాల్గొంటున్న నేను దీన్ని నిజంగానే సవాలుగా తీసుకున్నాను. ఒక కొత్త ప్రయోగం చేయబోతున్న యువ శాస్త్రజ్ఞుడిలా నా లోని ప్రతి అణువూ ఆవేశంలో పొంగి పోయింది. ఆ ఆవేశంతోనే మా మేనేజర్ దగ్గర సుదీర్ఘమైన సెలవు తీసుకున్నాక కులూకు బయలు దేరాను. ఎంతో మంది ఆర్టిస్టుల లాగే నాకుకూడా కులూ ఒక సెంటిమెంట్.





మార్కెట్ ధరలకన్నా తక్కువలో కొని డబ్బును ఆదా చేయండి!

ప్రముఖ మిల్లుల నుండి సరాసరి కొనుగోలు చేసిన సరికొత్త రకాలలో సరిలేని సూటింగ్ & షర్టింగ్ బిట్స్!

రూపమ్స్ గ్రాండ్ బజార్

ప్రకాశం రోడ్ (బిసెంట్ రోడ్ సెంటర్)
విజయవాడ-2. PHONE: 63272

గమనిక: నకిలీవిగాని, దెబ్బతిన్నవి గాని మరియు పాతసరుకునుగాని కొనుగోలు చేయకుండా చిరకాలంగా నమ్మకమైన "రూపమ్స్" మరియు "రూపమ్స్ గ్రాండ్ బజార్" షోరూముల్లోనే షాపింగ్ చేయ ప్రోత్సహించండి!

ఆకాశంలోంచి కొండల మీదుగా జారి పడే సెలయేళ్ళ ఉప్పొంగే హృదయంతో మలయ సమీరం, ఈ బాహ్య ప్రపంచాన్ని మరపించే కులూ లోయ సౌందర్యం చార్ట్ మీద, గడ్డి పరకల్ని కుంచెలుగా ఆడిస్తుంటే ఏర్పడ్డ చిత్రాన్ని నేను 'ప్రకృతి' అనుకోలేదు.


''మా మేనేజరు ప్రియురాలు'' అనుకున్నాను.

నిరాధారమైన ఆధారాలతో నా మనసులో ముద్రించబడ్డ ఒక అపురూప రూపసిని ఏదో అజ్ఞాతశక్తి కార్డ్‌బోర్డ్ మీదకి రప్పించింది.

కులూ నుండి తిరిగి వచ్చిన మరునాడే మాడ్రిడ్ ప్రయాణం కావలసి వచ్చింది. అన్నీ రెడీ చేసి ఉంచాడు మా మేనేజర్.

మాడ్రిడ్ ప్రయాణానికి ఆనంద పడినా—నే నెంతో సెంటిమెంటల్‌గా చేసిన కృషి ఫలితాన్ని ఒక అభిమాని ఆస్వాదించి ఆనందిస్తుంటే, ఆ ఆనందాన్ని పంచుకోలేక పోయానన్న బాధతోనే బయలుదేరాను.

నేను బయలు దేరుతుంటే ఆయన నా వైపు కృతజ్ఞతతో చూస్తూ— ''నా జీవితంలో ఏ క్షణమైతే లోకాతీతమైన మధురానుభూతిని పొందగలనని నమ్ముతానో ఆ క్షణాన దీన్ని అన్‌కవర్ చేస్తాను'' అన్నాడు.




''బెస్ట్ ఆఫ్‌లక్''

''బెస్ట్ ఆఫ్ లక్.'' నేనూ అన్నాను.

•  •  •  •

మాడ్రిడ్ ఆర్ట్స్ అకాడమీలో ఫస్ట్ ప్రయిజు వచ్చింది. ఎడ్వయిజరీ బ్యూరోలో మెంబర్‌గా సెలక్ట్ అయాను. అంతా కలలా జరిగిపోయింది. అకాడమీ ఛీఫ్ మెచ్చుకోలుగా చూస్తున్నప్పుడు నేను భారతీయుణ్ణయినందుకు గర్వించాను.

అందరి కాంప్లిమెంట్సూ, కంగ్రాచ్యులేషన్సూ కళ్ళ ముందు మెదులుతుంటే, ఎయిర్‌పోర్ట్ నుండి డైరెక్ట్‌గా మేనేజర్ గదికి నడిచాను.

''సీతా! మాట్లాడు! మాట్లాడవేం, సీతా? నో! నువ్వు మూగదానివి కాదు. కాదు—మాట్లాడు.''

భయంగా తలుపు తీశాను. బొమ్మను కౌగలించుకుని భయంకరంగా రోదిస్తున్నాడు మా మేనేజర్.

''సార్!''

''రా! శరత్! వచ్చావా! శరత్! నా సీత మాట్లాట్టం లేదు. మూగదై పోయిందా నా సీత! నో! ఇది నిజం కాదు. దీనికి నువ్వే కారణం. నువ్వే. రేయ్! నా సీతను మాట్లాడించు. అందమైన నా సీతకి మాటల్లేకుండా చేస్తావా? నిన్ను చంపేస్తాను. నా సీతను మాట్లాడించు.'' పెద్దగా కేకలేస్తూ మీదికి రాబోతుంటే వణికి పోయాను.

''రాత్రి నుండీ ఇలాగే అరుస్తున్నాడు'' అని పక్క గదిలో కుర్రవాడు వచ్చి చెప్పిన తరవాత అర్థమయింది.

కోపంతో నా మీదికి దూసుకొచ్చి, నీరసంగా నా చేతుల్లోంచి కిందికి జారిపోయాడు.

నే గీసిన ప్రియురాలు మాత్రం నిస్సహాయంగా చలనం లేని నవ్వు నవ్వుతూనే ఉంది.

టెన్షన్ తప్పిన ఆయన మైండూ, నిస్తేజమైన కళ్ళూ నన్ను వెక్కిరిస్తున్నయ్.

ఛీ! నే నసలు కళాకారుణ్ణే కాదు.

నే నో నేరస్థుణ్ణి. అవును కదూ?



INNOVATION AP/TEL/05-A